■ మధురాంతకం నరేంద్ర
■ చిత్రాలు: నర్సిం

# మహిమ

తిరిగి వెళ్ళిపోతూ మెటాడర్ రేపిన ధూళి పొగల్లోంచి 'మృత్యుంజయాశ్రమం' అన్న పేరున్న అర్ధవృత్తాకారపు బోర్డు ఆశ్రమం ప్రహరీ గోడల మధ్యలో ఉన్న ముఖద్వారంపైన స్పష్టాస్పష్టంగా కనబడుతోంది. ధూళి మేఘం మరి కాస్త పలచబారిన తర్వాత ద్వారానికున్న పెద్ద ఇనుప కమ్ముల తలుపులు కనిపించాయి. ఆ తరువాత ఆశ్రమం లోపల పెద్ద తామర పువ్వు ఆకారంలో కట్టిన కొలను మధ్యలో సజీవమూర్తి ఒకడు కూర్చున్నాడేమోనని భ్రమ కలిగించేలా వృద్ధ సన్యాసి ప్రతిమ ఒకటి గోచరమైంది. ముఖద్వారం దగ్గరున్న కొబ్బరి మట్టల పందిరి పచ్చి వాసనల్ని విరజిమ్ముతోంది. లోపల కట్టిన రంగు కాగితాల తోరణాల మధ్యలోంచి నల్లటి కాకొకటి ఎగురుతూ వెళ్ళి ప్రతిమ తల పైన కూర్చుంది. తాపీగా రెక్కలల్లార్చబోయి, చుట్టూ జనం కలయ తిరుగుతున్న పొలకువను పసిగట్టగానే అలాగే శిల్పంలో ఓ భాగంలా కదలకుండా నిలిచిపోయింది.

మెటాడర్ లోంచి దిగిన పట్టు చీరల, భారీ కాయాల ముత్తయిదువలు కొందరు రకరకాల సంచుల్ని భారంగా చేతబట్టుకుని ఆశ్రమంలోకెళ్ళిపోయారు. అదే వాహనం లోంచి దిగిన ముసలి మగవాళ్ళు కొందరు ఆశ్రమం ముంగిటిలోంచే దండప్రమాణాలు మొదలెడుతూ ముందుకురుకుతున్నారు. ముఖద్వారానికి కుడివైపున ఉన్న జోబిడీలో ఖరీదైన టేబులు ముందు రివాల్వింగ్ చైర్‌లో కూర్చున్న కాషాయ వస్త్రధారి తన కౌంటరు ముందున్న వ్యక్తులతో తన్మయంగా అష్టావధానం చేస్తున్నాడు. అతడి కుర్చీ వెనకున్న బంగారు ఫ్రేము ఫోటో ముందు అగరొత్తుల ధూపాలు గింగిరాలు తిరుగుతున్నాయి. ఆ నిలువెత్తు చిత్రంలో ధ్యానముద్రలో కూర్చున్న సన్యాసి ఎవరో స్పష్టంగా కనిపించడం లేదు.

మెటాడర్‌లోంచి దిగిన పాతికేళ్ళ యువతి ముఖంపైని కళ్ళజోడును కుడి చేత్తో సవరించుకున్నాక, ఎడమ చేత్తో బరువైన జిప్ బ్యాగ్‌ను భుజానికి తగిలించుకుంటూ వెనుదిరిగి, ముఖద్వారంలోంచి ఆశ్రమం లోపలికి నడిచింది.

"కెమేరాలూ, చెప్పులూ ఆశ్రమంలో నిషిద్ధం" అన్న హెచ్చరిక జోబిడీలోంచి ప్రసారమైంది.

చీకాకుతో నుదుటి పైన ముడతలు చెలరేగు
[illegible]
"నాకు స్పెషల్ పర్మిషనుంది" అంది ఆమె.

"ఏదీ, ఓసారి నన్ను చూడనివ్వండి" అన్నాడా సన్యాసి. కౌంటరు ముందున్న వ్యక్తులందరూ పక్కకు తప్పుకున్నారు. జిప్ బ్యాగు సొరుగులోంచి చిన్న కాగితం ముక్కను వెదికిపట్టి అతడి టేబుల్ పైన ఉంచిందావిడ. కాగితాన్ని పరిశీలించాక, "ఈ పర్మిషను స్వామీజీ ప్రధానాశ్రమం లోపల చెల్లదు. అక్కడికెళ్ళేటప్పుడు దీన్ని బయటే విడిచిపెట్టాలి. ఇక ఆ చెప్పుల్ని అక్కడ విడిచిపెట్టొచ్చు" అన్నాడతను చేయి చాపి వెనకున్న మండపాన్ని చూపిస్తూ.

"ఇలాంటి చోటుకొచ్చేటప్పుడైనా చక్కగా చీర కట్టుకొస్తే బావుండేది గదమ్మా! ణీ అంత అందమైన ఆడపిల్లకు ఆ షాల్వార్ కమీజులు ఏమీ నప్పడం లేదు గూడానూ!..." మండపంలో ఆ యువతి తన హైహీలు జోళ్ళను విడిచిపెడుతూ ఉండగా, అటొచ్చిన నడి వయసు స్త్రీ ఉచిత సలహాను సరఫరా చేసింది.

"ఈ అందమూ చందమూ పైనుండే పనికిరాని శరీరానిదే పిన్నిగారూ! ఆత్మ సౌందర్యం కంటే మించిందేముంది చెప్పండి" అన్న సమాధానాన్ని కోపంతో మిళాయించి ఆమె ఒళ్ళోకి విసురుతూ ముందుకు కదిలిందా యువతి.

సిమెంటు రోడ్డుకిరువైపులా ఉన్న వృక్షాలు సృష్ట్యాది నుంచీ ఉన్నట్టుగా కనబడుతున్నాయి. రోడ్ల పైన జన సంరంభం ఎక్కువగా ఉంది. అక్కడక్కడా చెట్ల కింద కొలువుదీరిన దేవుళ్ళ ప్రతిమలు పూజ ముగించుకుని నగరయానానికి బయల్దేరిన ఉత్సవ మూర్తుల్లా దర్శనమిస్తున్నాయి. కొండ కిందివరకూ వ్యాపించిన ఆశ్రమ ప్రాంగణంలో దూరదూరంగా కట్టిన భవన సముదాయాల చుట్టూ భక్తులు గుమిగూడిపోయి ఉన్నారు. ఎదురుపడిన యువకుడినొకణ్ణి "హలో" అంటూ పలకరించబోయిందా ఆగంతుకురాలు.

"సర్వం స్వామీజీ మయం" అంటూ అతను నమస్కారం చేస్తూ ముందుకు కదలిపోయాడు.


"సార్! ఇక్కడ ప్రధానాశ్రమం ఎక్కడ" అంటూ మరో వ్యక్తిని అడిందామె.

"ఆశ్రమంలో అలా బిగ్గరగా మాట్లాడకూడదు. సర్వం స్వామిమయం..." అని సమాధానం చెబుతూ అతనూ వెళ్ళిపోయాడు. రోడ్డు పక్కనున్న బెంచీపైన కూలబడిపోయిందామె. విసుగ్గా జిప్ బ్యాగ్‌లోంచి నీళ్ళ సీసా పైకి తీసి రెండు గుక్కలు తాగింది.

"ఆశ్రమంలో మినరల్ వాటర్ నిషిద్ధం. ఇక్కడి నీళ్ళు తీర్థం. సర్వ వ్యాధి నివారణం" అంటూ ఓ యువకుడు బెంచీపైకొచ్చి కూర్చున్నాడు.

"ఈ ఆశ్రమం లోపలికి బయటి గాలి గూడా ప్రవేశించగూడదా" అందామె విసుగ్గా.

సన్నగా, పొడుగ్గా ఉన్న ఆ వ్యక్తి ఒంటెలా మెడను చిత్రంగా వంచుతూ, "ముందా బ్యాడ్జీ తీసి లోపల దాచేయండి. చెప్పకుండానే మీరు జర్నలిస్టని తెలిసిపోతోంది. జర్నలిస్టులంటే ఇక్కడి భక్తులకు మంచి ఒపీనియన్ లేదు. నిఖిత... అదేగదూ మీ బ్యాడ్జీలో రాసిన పేరు... ఇలా మనం చాలాసేపు ఇక్కడ కూర్చోవడం గూడా ఫాల్టే! ఆ క్యాంటీన్‌లో కూర్చుందాం పదండి. చాలా దూరం నుంచి జర్నీ



చేసి వచ్చినట్టున్నారు. బాడీకి ఫ్యూయల్ చాలా అవసరం" అన్నాడతను. రకరకాల వయసులున్న మగవాళ్ళు తెలుపు రంగు యూనిఫారాల్లాంటి దుస్తుల్లో నడచిపోతున్నారు. వాళ్ళ చొక్కాలకు స్వామీజీ చిత్రమున్న బ్యాడ్జీలు వేలాడుతున్నాయి.

అలాంటి బ్యాడ్జీలే ధరించిన సన్యాసినులు మరి కొందరు ఆ వెనకే సాగిపోయారు.

వాళ్ళెవరూ మాట్లాడుకోవడం లేదు. ఎవరి లోకంలో వాళ్ళున్నట్టుగా, మర బొమ్మల్లా అటూ ఇటూ చకచకా నడుస్తున్నారు. అందరి ముఖాల్లోనూ వింత జిలుగులు... తన్మయం.

రాజప్రాసాదంలా వెలుగుతున్న క్యాంటీనులో ఖరీదైన తివాచీలు పరిచారు. అందమైన కుర్చీలలో కూర్చున్న వ్యక్తులు కొందరు తళతళలాడుతున్న పళ్ళాల్లోంచి ఫలహారాల్ని ఆరగిస్తున్నారు.

కౌంటరు దగ్గరి నుంచి రెండు పళ్ళాల ఫలహారాన్ని పట్టుకొస్తూ, "ఇక్కడ కూర్చుందాం రండి. సర్వం స్వామీజీమయం" అన్నాడా యువకుడు.

"మీరు కూడా భక్తులేనా" అని ప్రశ్నించింది నిఖిత.

"జర్నలిస్టుల్లో డివోటీలుండగూడదా" అంటూ నవ్వాడతను.

"మీరు జర్నలిస్టు గూడానా" అంటూ మరోసారి విస్మయపడిందామె.

"మరెందుకు మిమ్మల్ని రిసీవ్ చేసుకున్నాననుకున్నారు" అన్నాడతను నెమ్మదిగా.

"నా పేరు సంతోష్. ఇదిగో నా ఐడెంటిటీ కార్డు. ఈ ఆపర్చ్యునిటీ కోసం మా కొలీగ్స్ చాలా మంది ట్రై చేశారు. ఎప్పుడో యుగానికొకసారి జరిగే అద్భుతం. మిస్ అయితే లైఫే వేస్టు. స్వామి అనుగ్రహం వల్ల బాస్ నన్ను వెళ్ళమన్నాడు. మీ



జర్నల్‌కున్న సర్క్యులేషనూ, పాపులారిటీ తెలియని దెవరికి? ఇలా రాగలిగారంటే మీరెంతో లక్కీ!"

పళ్ళాన్ని తన ముందుకు లాక్కుంటూ, "ఆశ్రమమంటే గుడిసెలూ, మండపాలూ ఉంటాయనుకున్నాను. ఇదేమో హాలిడే రిసార్ట్‌లా అల్ట్రా మాడ్రన్‌గా ఉంది. క్యాంటీను ఫైవ్‌స్టార్ హోటలులాగుంది. ఇంత మంది జనం గుమిగూడినా ఇంత శుభ్రంగా ఎలాగుంచగలుగుతున్నారు" అని అడిగింది నిఖిత.

ఇప్పుడు ఈ చోట్లో మినిమమంటే టెన్ థౌజండ్స్ జనం ఉంటారు. ఎక్కడైనా సౌండు వినబడుతుందేమో చూడండి. ఎప్పుడూ ఆశ్రమంలో పక్షుల కిలకిలారావాలు వినబడాలని స్వామీజీ ఆర్డరు. ఈ క్యాంటీనులో డే అండ్ నైట్ సప్లయ్ జరుగుతోంది. ఇలాంటి క్యాంటీన్లు చాలా ఉన్నాయి. ఒకసారి కిచెన్‌లోకెళ్ళి అబ్జర్వ్ చెయ్యండి. ఇక్కడి పాన్‌లో బజ్జీలు కూడా సౌండు చెయ్యవు. అంట్లు కడిగేదెక్కడో కనిపించదు. ఈ రోడ్ల పైన పాలు పోసి పాలెత్తుకోవచ్చు. అంతా స్వామీజీ మహత్యం. అంతకంటే ఆన్సరు ఇంకేమీ దొరకదు..." ఫలహారం తింటూనే చెప్పుకుపోసాగాడు సంతోష్.

"ముహూర్తం ఎప్పుడు?" అడిగింది ఆమె.

"కార్తీక పంచమి. ముహూర్త గడియలు ఈ రోజు ఈవెనింగ్ సిక్స్‌కు బిగినవుతాయి. రేపు ఈవెనింగ్ లోపల ఎప్పుడైనా సంభవించవచ్చు. పరమపదానికి అన్ని అరేంజ్‌మెంట్లూ జరిగినాయి. కొత్త ఆడిటోరియాన్ని రికార్డు టయంలో కట్టేశారు. ఇంకా వేలాది మంది భక్తులు రావాల్సి ఉంది. సంతర్పణలు అంతూ పొంతూ లేకుండా జరుగుతున్నాయి."

"అయినా, పెద్ద పండగేదో జరగబోతున్నట్టు ఈ వేడుకలెందుకు" అంది ఆమె జీరబోతున్న కంఠంతో. "ఎంత గంభీరమైన పేరు పెట్టినా జరగబోయేది చావే గదా?"

"ఆత్మకు డెత్ లేదు. అది కేవలం బాడీలను ఎక్స్ఛేంజ్ చేసుకుంటుందంతే" అన్నాడతను స్పష్టంగా.

"చిరంజీవి ఎక్కడున్నాడు" అంటూ చివాలున ప్రశ్నించింది నిఖిత.

సంతోష్ ఆహారాన్ని నమలడం సైతం మానేసి, "అలా కంప్లీట్ నేమ్‌తో ఆయన్నెవరూ పిలవరిక్కడ! చిన్నాజీ అని పిలుస్తారు" అన్నాడు.

"ఇంకా నయం, వాళ్ళమ్మగారు పిలిచినట్టుగా బుజ్జీ అని పిలవడం లేదు" అంది నిఖిత నిస్సారంగా నవ్వుతూ.

"ఫారిన్ మ్యాగ్జయిన్సన్నీ ఆయనకు చినిగ్మా అని పేరు పెట్టాయన్నారు. చిరు ప్లస్ ఎనిగ్మా చినిగ్మా అయి ఉంటుంది. కానీ, ఇంట్లో ఆయనకింకో నిక్‌నేముందని నాకింతవరకూ తెలియదు..." చెబుతూనే పాకెట్ డైరీని పైకి లాగి అందులో నోట్ చేసుకున్నాడతను. అంతలోనే అనుమానంగా, "ఈ న్యూస్ మీకెలా తెలిసింది? ఆయనతో అక్వేయింటెన్సుందా మీకు" అని ప్రశ్నించాడు.

ఆమె మాట్లాడలేదు.

"చెప్పడం ఇష్టం లేకపోతే ఐ కాంట్ ప్రెజరైజ్ యూ! ఎవర్నీ ఏ విషయంలోనూ బలవంతం చెయ్యగూడదని ఆశ్రమం రూలు" అన్నాడతను.

ఉన్నట్టుండి దూరం నుంచి గంటారావం వినిపించింది. క్యాంటీనులో కూర్చున్నవాళ్ళు సైతం తినడం ఆపేసి కళ్ళు మూసుకుని, చేతులు జోడించేశారు.

అందరి పెదవులూ ఏదో ప్రార్థనను వల్లిస్తున్నాయి.

ఎంగిలి చేత్తో నమస్కరించలేక అవస్థపడుతున్న సంతోష్‌ను చూడగానే నిఖితకు నవ్వు ముంచుకొచ్చింది.

అయిదు నిమిషాల తరువాత మళ్ళీ గంటారావం వినిపించింది. అందరూ తెంపలేసుకుని తినడం ప్రారంభించారు.

"ప్రధానాశ్రమంలో హారతి ఇస్తున్నారు" అన్నాడు సంతోష్.

అతడి మాటల్ని పట్టించుకోకుండా, "చిరంజీవి... అదే చిన్నాజీతో మీకు పరిచయముందా" అని అడిగింది నిఖిత.

"ఉంది. కానీ, నాతో మాత్రం ఆయనకు పరిచయం లేదు" అంటూ బలవంతంగా నవ్వాపుకున్నాడు సంతోష్.

"లేకపోతే అంత పాపులర్ ఫిగర్‌తో నాలాంటి ఆర్డినరీ జర్నలిస్టుకు పరిచయమెక్కడుంటుంది చెప్పండి? ఆయన మేథమాటికల్ జీనియస్సనీ, హ్యూమన్ కంప్యూటరనీ లోకమంతా పొగుడుతోంది. మేథమాటిక్స్‌లో ఆయన సాల్వ్ చేసిన ప్రాబ్లమ్స్ గురించి సెమినార్లు జరిగాయి. ఆయనలాంటివాడు ఇంకేదైనా దేశంలో పుట్టుంటే పెద్ద పెద్ద ప్రైజులు వచ్చి ఉండేవని అంటున్నారంతా!"

"మనకు తెలియని సబ్జక్టులో, మనకు అర్థం కాని గొప్పతనం గురించి నమ్మడం భావ్యం గాదు" అంది నిఖిత నింపాదిగా.

"వాళ్ళ నాలెడ్జి మనకు తెలియకపోవచ్చు. స్వామీజీ మాటల పవరు మాత్రం బాగా తెలుసు" అన్నాడు సంతోష్ కత్తితో కోసినట్టుగా.

"చిన్నాజీని లోకమంతా ప్రాడిజీ అంటోంది. ఎయిటీన్ ఇయర్స్ వరకూ ఆయన బిలో ఆవరేజ్ మీడియోకర్ స్టూడెంటే! వీక్‌గా ఉంటాడో, పోతాడో తెలియకుండా ఉండేదంటారు. పెద్ద స్వామీజీ- అనంతానంద స్వామీజీ- బొందితో సమాధిలోకెళ్ళిన తర్వాత స్వామీజీకి కారొనేషన్, అదే పట్టాభిషేకం జరిగిన కొత్తలో జరిగిన సంగతి అది. చిన్నాజీ వాళ్ళ నేటివ్ ప్లేసు ఇక్కడికి టెన్ కిలోమీటర్స్‌లో ఉంది. చిన్నాజీ ప్రతి ఫ్రైడే క్రమం తప్పకుండా ఇక్కడికి బై

> "చక్కగా చీర కట్టుకొస్తే బావుండేది గదమ్మా! నీ అంత అందమైన ఆడపిల్లకు ఆ షాల్వార్ కమీజులు ఏమీ నప్పడం లేదు గూడానూ!.." అని ఓ నడివయసు స్త్రీ సలహా.

వాక్ వచ్చేవాడట! అప్పట్లో ఆశ్రమం ఇంతగా డెవలప్ కాలేదు. ఇదంతా పెద్ద ఫారెస్ట్. ఇప్పుడిక్కడ ఇంత పెద్ద ఆశ్రమమూ, చుట్టూ ఇంత ఊరూ పెరగడానికి రీజనేమిటి? స్వామీజీ మహత్యమే! ఆయన చేసిన మాయల్లో చిన్నాజీ కూడా ఒకటి! ఆయన ఆశీర్వాదమే లేకుంటే ఆ వీక్ బాడీడ్ బ్లోక్- బతుకుతాడో, చస్తాడో తెలియని పేషెంటు- టెన్త్ టేబుల్లైనా చెప్పలేని ఇడియాటిక్ బాయ్- ఇంత జీనియస్సుగా ఎలా తయారవుతాడు? సర్వం స్వామిమయం జగత్!"

"ఈ ఇరవై ముప్పై అంకెల గుణకారాలనూ, ఇంకా పెద్ద పెద్ద లెక్కల్నీ సాల్వ్ చేసే శక్తి ఇంట్యూటివ్‌గా చిన్నప్పటి నుంచీ ఉండేదనీ, స్వామీజీ కేవలం మానసిక ధైర్యాన్నిచ్చాడనీ కొందరంటారు" అంది నిఖిత కుతూహలంగా కళ్ళు మిలమిలలాడిస్తూ.

"దాన్ని మీరు ఇంట్యూషన్ అంటారు. నేనేమో మహత్యమనే అంటాను" అన్నాడు సంతోష్

రుమాలుతో ముఖం తుడుచుకుంటూ.

"ఇప్పుడైనా ఆయన లెక్కలకు సమాధానాలు మాత్రమే చెప్పగలుగుతున్నాడు. ఆ సమాధానమెలా తెలుసుకున్నాడో సైంటిఫిక్‌గా చెప్పలేకపోతున్నాడు. చేతగాని దాన్ని శాస్త్రమని ఎలాగనడం?" నిఖిత తన వాదనను పొడిగించింది.

"స్వామీజీ అంతటి మహిమాన్వితుల ఆశీర్వాదం దొరికిన తర్వాత ఇక ఆర్డినరీ హ్యూమన్ బీయింగ్స్‌యిన సైంటిస్టుల రికగ్నియిజేషన్‌తో పనేముంది? ఆయనకు జరిగిన ఫెలిసిటేషన్ల ముందు, రాని అవార్డుల గొప్పేముంది? ఇంత చిన్న వయసులో ఇంత సాధించిన మనిషిని ఇంకొకర్ని చూపించండి. అంతా స్వామి మయం."

తన వాదనకు ముక్తాయింపులా ఖాళీ చేసిన పళ్ళాన్నెత్తుకుని వాష్ బేసిన్ దగ్గరికి నడచాడు సంతోష్.

తన పళ్ళాన్ని సైతం కడిగి పెట్టేశాక, సంతోష్ దగ్గరికి వచ్చి నిల్చుని, "ఎంత మేధావి అయితే మాత్రం ఏం లాభం? రేపటితో ఆయుస్సు తీరిపోతుందని అంటున్నారు కదా మీరు" అంది నిఖిత సాలోచనగా.

"డౌట్ లేదు. స్వామీజీ వాక్కుకు అప్పీలు లేదు. ఫోరియర్స్ కఠిన దీక్ష తర్వాత గానీ చిన్నాజీ పైన స్వామీజీకి దయ కుదరలేదు. వాళ్ళ మదర్‌ని అప్పు డడిగాడాయన. పేరూ, పాపులారిటీ తెచ్చుకునే అల్పాయుష్కుడు గావాలా? కాకిలా లాంగ్ లైఫ్‌తో బతికేవాడు గావాలా? ఎంత గొప్ప డివోట్ గాకపోతే ఆమె మొదటి ఆల్టర్‌నేటివ్‌ను కోరుకుంటుంది? అటువంటి గొప్ప డివోటీలు బతుకున్న పీరియడ్‌లో బతుకుతున్నందుకు మన జన్మ కూడా ధన్యమే!" అన్నాడు సంతోష్ ఫలహార శాల ముందున్న వరండాలో కూర్చుంటూ.

"స్వామీజీది ఏ ఊరు? ఎక్కడ పెరిగాడు" అని అడిగింది నిఖిత తాను కూడా పక్కనే కూర్చుంటూ.

"నదుల ఆరిజన్నీ, గొప్పవాళ్ళ బాక్‌గ్రౌండునూ ఇన్వెస్టిగేట్ చేయకూడదంటారు" అంటూ నవ్వేశాడు సంతోష్. "ఆయన పుట్టింది ఈ స్టేట్‌లో గూడా గాదన్నారు. ట్వల్వ్ ఇయర్స్ తపస్సు చేశాకగానీ ఆయనకు ఇక్కడికొచ్చేందుకు పర్మిషను దొరక లేదట. పెద్ద స్వామీజీ వీరిని చూసిన మరుక్షణమే వీరే తన డిసెండెంటని తెలుసుకున్నారట. ఆశ్రమ పీఠాన్ని చేరిన కొద్ది రోజుల్లోనే దీన్నింతగా డెవలప్ చేసి, ఆయన తన కెపాసిటీని నిరూపించి చూపించారు. ఆయన చేయని మహత్యాలూ, నెరవేర్చని కార్యాలూ లేవు. లూయీ షెపర్డ్ రాసిన మిరకల్స్ ఆఫ్ స్వామీజీ చదవండి మీరు. ఇక్కడి బుక్ షాపులో దొరుకుతుంది. స్వామీజీ లెక్చర్స్ వాల్యూం కొత్తగా రిలీజయింది. చదవండి. గొప్ప స్పిరిచ్యువల్ ఎన్‌లైట్‌మెంటు పొందుతారు."

"నాలుగేళ్ళకు మునుపొకసారి స్వామీజీ పెద్ద అనారోగ్యానికి గురైనారనీ, అప్పుడాయనకు చికిత్స జేసిన డాక్టరు అయిపు లేకుండా పోయాడనీ పత్రికల్లో రాశారు..." అంది నిఖిత.

"ఆ మాటలు ఇక్కడ పెద్దగా అనకండి. ఎవరైనా వింటే డేంజరు. అదంతా గాసిప్. పత్రికలదంతా సెన్సేషనలిజమ్. ఆ విషయం మనకు వేరేవాళ్ళు చెప్పాలా" అంటూ హెచ్చరించాడు సంతోష్.

క్యాంటీను ముందున్న రోడ్డు పైన నలుగురు విదేశీయులు చిన్మయ ముద్రలో నడుస్తున్నారు.

పంచ, జుబ్బాల్లో వాళ్ళ తెల్లటి శరీరాలు విచిత్రంగా మెరుస్తున్నాయి. వాళ్ళ రాగిరంగు పిలకలు గాలిలో ఆడుతున్నాయి. వాళ్ళ జుబ్బాల పైన స్వామి చిత్రమున్న బాడ్జీ స్పష్టంగా కనబడుతోంది.

ఇంతకీ చిరంజీవి ఎక్కడున్నాడిప్పుడు?" నిఖిత గొంతు నూతిలోంచి పలికినట్టుగా వింతగా ధ్వనించింది. సంతోష్ కోపంతో చివాలున తల పైకెత్తి చూస్తూ, "మరోసారి ఆయన్నలా పిలవకండి. చిన్నాజీ అవతార పురుషులు. బృహస్పతి అవతారం. రేపటి లోపున అవతారం చాలించబోతున్నారు. మీరంతా చూస్తూ ఉండగానే పుష్పరథమెక్కి స్వర్గారోహణ చేయబోతున్నారు. ష్యూర్" అన్నాడు.

"స్వామీజీ మొదట్లో ఏమన్నాడు? ముప్పై అయిదేళ్ళ లోపున పరమపదం పొందుతాడని చెప్పాడు. అవునా? ఇప్పుడు కచ్చితంగా కార్తీక పంచమి రోజున అంటున్నాడు. ఇలా మాటెందుకు మార్చాడు" అంటూ పెంకెగా ప్రశ్నించింది నిఖిత.

"స్వామీజీ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోలేని వాళ్ళు రకరకాల ఇంటర్‌ప్రిటేషన్లిస్తారు. అది ఆయన ఫాల్టు గాదు. అది హ్యూమన్ మైండుకుండే లిమిటేషను మాత్రమే. రేపటి లోపుగా ఆయన మహత్యాన్ని చూడబోతున్నారు గదా మీరు గూడా" అంటూ జేవురించిన ముఖంతో విసుక్కున్నాడు సంతోష్.

"మీరు చిన్నాజీ గారిని కలవాలా? నేను చూపిస్తాను. నాతో రండి" అన్న కొత్త కంఠమొకటి వెనక నుంచి వినిపించింది.

నిఖిత తల తిప్పి చూసింది.

> **"చిన్నాజీ రేపటి లోపున అవతారం చాలించబోతున్నారు. మీరంతా చూస్తూ ఉండగానే పుష్పరథమెక్కి స్వర్గారోహణ చేయబోతున్నారు."**

## 2

వేదిక పైన పరచిన తెల్లటి పరుపు పైన పెద్ద తలగడా కేసి జారిగిలబడి కూర్చున్న నడివయసు సన్యాసి ఆకారం, గదిలో వెలుగుతున్న రకరకాల దీపాల వెలుతురులో నిగనిగలాడుతోంది.

అతడి వెనక గోడ పైన నిలువెత్తు స్వామీజీ పటం వేలాడుతోంది. దానికి తగిలించిన పూలమాల పైన రెండు తుమ్మెదలు గీంకారం చేస్తున్నాయి. పటం ముందున్న దీప స్తంభం లోంచి వస్తున్న కాంతి, గది పైకప్పు లోంచి వెలుగుతున్న ఫ్లోరసెంటు దీపం ముందు వెలవెలాబోతోంది. కిటికీల్లోంచి వస్తున్న సూర్యకిరణాల ముందు గదిలోని కాంతి కృత్రిమంగా కనబడుతోంది.

వేదిక ముందు రెండు మెట్లకు దిగువగా కుర్చీలో మరో నడివయసు సన్యాసి కూర్చుని ఉన్నాడు.

దీపాల కాంతికి దూరంగా కూర్చోవడం చేత అతడి శరీరం చీకటి వెలుతురులతో చేసిన చిత్రమైన శిల్పంలా కనబడుతోంది. అతడి ముందున్న కుర్చీలో కూర్చున్న నిఖిత నిరలంకారమైన ఆ గదినంత మరోసారి కలయ జూసి, "చాలా సేపటి నుంచీ బయట వేచి చూశాను" అంది పుల్ల విరిచినట్టుగా.

"ఒకటి రెండు గంటల సేపు నిరీక్షించేదానికే బాధ పడిపోతే ఎట్లమ్మా! సాక్షాత్కారం దొరకాలంటే బతుకంతా నిరీక్షించాల్సి రావచ్చు. అంతా వారి కృప" అంటూ వేదిక పైని వ్యక్తికి చేతులు జోడించాడు కుర్చీలో కూర్చున్న వ్యక్తి.

వేదిక పైన కూర్చున్న సన్యాసి అదోలా చూస్తూ కనురెప్పలల్లార్చుతున్నాడు.

"రేపు సాయంకాలం లోపుల ఎప్పుడైనా సంభవం జరగవచ్చు. సమయానికి అన్నీ సరిగ్గా అమరించాల. చూసేదానికి యువ స్వామీజీ ఆ మాదిరిగా నిర్లిప్తంగా, శాంతంగా అగుపిస్తావుండారుగానీ, ఆయన కంటి చూపుతోనే, చేతి సైగతోనే ఈ ఆశ్రమంలో పనులన్నీ జరగతా ఉండాయి. ఆయన్నీ సమయంలో కలవాలంటే సులభంగా అయ్యే పనిగాదు" అన్నాడు కుర్చీ పైని సన్యాసి.

"నేనేమీ కలవాలని రాలేదు. నేను..."

"తెలుసులే! కానీ, యువ స్వామీజీ మాత్రం నిన్నే చూడాలన్నారు" అంటూ అతను వేదిక పైని సన్యాసికేసి చూపెట్టాడు. "ఈ ఆశ్రమంలో ఆయన ఆజ్ఞ లేకుండా చీమ గూడా కుట్టదు."

"చిన్నాజీ నీకెప్పటి నుంచీ తెలుసు?" ఈ సారి ప్రశ్న యువ స్వామీజీ నోటి నుంచి వెలువడింది.

నిఖిత ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ, "పెద్ద పరిచయమేమీ లేదు. కొద్దిగా..." అంటూ మాటలు నాన్చింది.

"నిజం చెప్పాల. యువ స్వామీజీకి దివ్య దృష్టుంది. తప్పు చేస్తే చిటికెలో దొరికిపోతావు" అన్నాడు సన్యాసి.

"నిజమే చెప్పాను. ఏడాది క్రితం బెంగుళూరులో జరిగిన కాన్ఫరెన్సుకు ఆయన గెస్టుగా వచ్చాడు. న్యూస్ కవరేజీ కోసం నేనూ వెళ్ళాను. ఆ నాలుగు రోజులూ ఆయనతో కలిసి తిరిగే అవసరం వచ్చింది. అంతే" అంది నిఖిత.

"అంత చిన్న పరిచయంతోనే ఆయన్ని పేరు పెట్టి పిలిచే చనువెట్ల వచ్చిందో" అన్నాడు యువ స్వామీజీ.

"బెంగుళూరు సెమినారులో కొందరాయనను ఇంకా చనువుగా పిలిచేవాళ్ళు. మీ ఆశ్రమంలో మాత్రమే ఆయన్నిలా చిన్నాజీ అని పిలుస్తున్నారు" అంది నిఖిత వినుగా.

"యువ స్వామీజీతో ఆ మాదిరి దుందుడుకుగా మాట్లాడగూడదు" అన్నాడు శిష్యుడు.

ఆయన దయ అందరికీ దొరికేది కాదు. ముందు జన్మలో పెద్ద పుణ్యం జేసుకోనుంటావు. అందుకే ఇంత సులభంగా అది దొరికింది. రెండేండ్లకు ముందు నీమాదిరిగానే జీన్సు పాంటూ షర్టులతో ఫారిన్ జర్నలిస్టు ఇక్కడికొచ్చింది. యువ స్వామీజీ దర్శనమిచ్చినారు. ఆమె భక్తురాలైపోయింది. ఇప్పుడిక్కణ్ణే బ్రహ్మచారిణిగా బతకతా ఉంది..."

"అయితే, చిన్నాజీ రేపు పరమపదం జేరడం తప్పదా" అంటూ నిస్సహాయంగా ప్రశ్నించింది నిఖిత.

"స్వామీజీ మాటకు తిరుగు లేదు, రాదు, రాని వ్వను." లావుపాటి పెదవుల్ని విశాలం చేసి నవ్వుతూ అన్నాడు యువ స్వామీజీ. నిఖిత నివ్వెరపోయింది.

"స్వామీజీకీ, యువ స్వామీజీకీ తేడా లేదు" అంటూ అందుకున్నాడు శిష్యుడు. "శరీరాలు వేరే వేరే అయినా వాళ్ళ ఆత్మ ఒక్కటే! నరనారాయణుల తీరు. యువ స్వామీజీ ఆధ్వర్యమే లేకపోతే ఇంత ఆశ్రమమే లేదు. స్వామీజీ ఆంతరంగిక ఆశ్రమ నిర్వహణను ఒక భుజం పైనా, మిగిలిన ఆశ్రమ పరిపాలనను ఇంకో భుజం పైనా మోస్తా ఉండారీయన. దేహంతోనే సమాధిలోకి పోవాలని స్వామీజీ చానాసార్లు సంకల్పించారు. కానీ, యువ స్వామీజీ ఒప్పుకోలేదు..."

యువ స్వామీజీ ప్రసన్నంగా నవ్వుతూ, "నాలుగు రోజుల పరిచయంతోనే కలవాలని వచ్చావు. చిన్నాజీ నిన్నింకా జ్ఞాపకం పెట్టుకున్నాడనుకుంటు న్నావా" అని ప్రశ్నించాడు.

"అంత పెద్ద మాథమాటికల్ జీనియస్ ఇంత చిన్న విషయం గుర్తుంచుకోలేకపోతారా" అంది

నిఖిత నిశితంగా చూస్తూ. యువ స్వామీజీ ముఖంలో చిన్న చిడుముడిపాటు చెలరేగింది. శిష్యుడు వెంటనే అందుకున్నాడు: "చిన్నాజీ బుర్రలో వెలిగే దీపం వీరి దయాభిక్షే గదా! ఏది గుర్తు పెట్టుకోవాల్సో, ఏది వద్దో నిర్ణయించేది ఈయనే!"

నిఖితకు బుర్ర మొద్దుబారినట్టు తోచింది.

"ఈయన గురించి నీకు తెలిసినట్లు లేదు. ఈయనకు యువ స్వామీజీగా పట్టం గట్టినాంకే ఈ ఆశ్రమం ఇంతగా పెరిగింది. ఇక్కడుండే ప్రతి రాయి వెనకా, చెట్టు వెనకా ఈయన సంకల్పమే కనిపిస్తాది. ఈయన మాట లేకుంటే స్వామీజీ గూడా దర్శనమియ్యరు... పది హేడేండ్లకు ముందు పొయ్యే ప్రాణంతో కొట్టు మిట్టాడతా ఉండే చిన్నాజీ కాయాన్ని వాళ్ళమ్మ ఆశ్రమానికి మోసుకొచ్చినప్పుడు, వాళ్ళ మింద స్వామీజీకి దయ కలిగించిందెవురు? అంతెందుకు, ఆ విపత్తులో వాళ్ళమ్మను ఆశ్రమానికొచ్చేటట్లుగా సంకల్పం గల్పించిందెవురు? చెప్పేది యువ స్వామీజీ వంతు, చేసేది స్వామీజీ వంతు" అన్నాడు శిష్యుడు.

"ఈ విచిత్రంలో ఎవరి భాగమెంతో తెలుసుకోవలసిన అవసరం నాకు లేదు" అంది నిఖిత వీలయినంత నయమనాన్ని ప్రదర్శిస్తూ.


"చిన్నాజీకి చిన్నప్పటి నుంచీ ఆస్మా ఉందని తెలుసు మీకు. అది బాగా ముదిరిపోయిందనీ, దాంతో ఆయన చాలా రోజులు బతకడు లెమ్మనుకున్నారు. దాన్ని మీ వాదానికనుగుణంగా మార్చుకోవాలనుకున్నారు. తీరా మీరు చెప్పిన గడువు దాకా ఆయన బతికేసరికి ఇప్పుడు మాట మారుస్తున్నారు.

"హిరణ్యకశిపుడి అంశతో పుట్టిన భక్తులంటే యువ స్వామీజీకి ప్రీతి ఎక్కువ" అన్నాడు శిష్యుడు ముఖం ముడుచుకుంటూ. "చిన్నాజీ ఆయుస్సు తీరిపోతా ఉందని తెలిసినా ఆయన కుటుంబంలోని మనుషులంతా ఎంత భక్తితత్పరతతో ఉండారో నువ్వే చూడు. చిన్నాజీ గూడా ఆయన ఆజ్ఞ ప్రకారం బ్రహ్మచారిగానే ఉన్నాడింతవరకూ. వాళ్ళవాళ్ళంతా ఇప్పుడు పండగ జేసుకుంటా ఉండారిక్కడ..."

యువ స్వామీజీ అర్ధనిమీలిత నేత్రాలతో ధ్యానంలోకెళ్ళిపోయినట్టుగా ఉన్నాడు. శిష్యుడు పైకి లేచి దీపపు సెమ్మెలోకి నూనె పోసి, వత్తులెగదోసి తిరిగొచ్చాడు. "చిన్నాజీకి ఆస్మా ఉందని నీకెట్ల తెలును" అన్న ప్రశ్న యువ స్వామీజీ నోటిలోంచి ఊడిపడింది. "మానసికంగా అలజడి చెలరేగినప్పుడు అది ముంచుకొస్తుంది. ఆయనంత ఇబ్బంది పడేలా ఏదో జరిగుండాలి... నువ్వే చేశావు?"

"నేనా?... నేను..." నిఖిత కంగారుపడిపోయింది. పైన ఫ్యాన్లు తిరుగుతున్నా గదిలో ఉక్కపోతగా ఉంది. వాతావరణమంతా ఘనీభవించి తనను బంధించినట్టుగా తోచడంతో నిఖిత విచలితురాలైపోయింది. ఆమె ఇబ్బందిని గమనించినట్టుగా శిష్యుడు అదోలా నవ్వేశాడు.

"యువ స్వామీజీ దయ నీపైన పడింది. అల్లరి గొర్రెపిల్ల పైన్నే గొల్ల కాపరి దృష్టి. నువ్వేదో సొంత కోరికపైన్నే ఆశ్రమానికొచ్చినట్టుగా ఆయనకు తెలిసిపోయింది. స్వామీజీ అవతారపురుషులు. ఆయన ఆశీర్వాదం కావాలంటే యువ స్వామీజీవారి కరుణే దారి! నీ అన్వేషణను దోవ మర్లించేదానికే నిన్నిట్ల రప్పించినారు. మంత్రోపదేశం చేస్తారు నీకు..."



యువ స్వామీజీకేసి ఓసారి తదేకంగా చూసింది ఆమె. అంతలోనే నిలువెల్లా భయంతో వణికిపోయింది. "నేను వెళ్తాను" అంటూ పైకి లేచింది.

"ఆశ్రమానికొచ్చినాక స్వామీజీ నామస్మరణం చెయ్యాల. భక్తితో పవిత్రంగా ఉండాల. అనవసరమైన పనులతో కాలహరణం చెయ్యగూడదు. ఇక్కడుండే ప్రతి మనిషిపైనా యువ స్వామీజీ నిఘా ఉంటుంది" అంటూ హెచ్చరించాడు శిష్యుడు.

బెంబేలుపడుతూ గుమ్మంకేసి కదిలింది నిఖిత.

"ఫరవాలేదు. శాంతంగా ఆలోచించుకోనీ! పరమపద సేవను చూసే వెళ్ళనీ! పత్రికల్లో చక్కగా రాస్తుందిలే" అన్నాడు యువ స్వామీజీ.

"చిన్నాజీ రేపటిలోగా... అయితే" అంటూ అర్ధాంతరంగా ఆగిపోయింది నిఖిత.

"తప్పదు. దైవ వాక్కు" అన్నాడు శిష్యుడు.

"బెంగుళూరు సభలప్పుడు గుండులా కనిపించాడు. ఇంత త్వరగా అంత ప్రమాదమెలా ముంచుకొస్తుంది" అని విస్మయంగా ప్రశ్నించింది ఆమె.

"చిన్నప్పటి నుంచీ ఆయనకు ఆస్మా ఉందన్నావు ఇప్పుడే! ఆరోగ్యమూ, అనారోగ్యమూ- అన్నీ మాయ! అంతా స్వామీజీ సంకల్పం. సంభవం అవసరమైనప్పుడు పెరటి గుమ్మంలోంచి గూడా రావచ్చు" అన్నాడు యువ స్వామీజీ.

"స్వామీజీ మాటే సత్యం. యువ స్వామీజీ ఆయన మాటల్ని ఆచరణలో పెట్టే దీక్షలోనే ఉండారు ముప్పయ్యేండ్లుగా. అవసరమైతే యమధర్మరాజు చెవులు పట్టి భూమికి లాక్కొచ్చే శక్తి ఆయనకుండాది" అన్నాడు శిష్యుడు పైకి లేచి నిల్చుంటూ.

"అంటే!" భయంతో నిలువెల్లా వణకిపోతూ వెనుదిరిగి చూసింది నిఖిత.

యువ స్వామీజీ ముఖంలో అదే చిరునవ్వు ఎండిన మల్లెపువ్వులా రెపరెపలాడుతోంది.

శిష్యుడు మాత్రం పూనకం పట్టినవాడిలా పైకి లేచి దీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తున్నాడు. "నువ్వు ఇక్కడినించి పొయ్యేలోపల గొప్ప దివ్యానుభవాన్ని పొందతావు. అప్పుడు స్వామీజీ మంత్రోపదేశాన్ని ఆశిస్తావు. నూటికో, కోటికో ఒక్కరికి దొరికే వరం అది..." అతడి కంఠం తారస్థాయిలో వెలువడసాగింది.

నిఖిత పరుగే నడకగా గది బయటికొచ్చేసింది.

కనిపించిన రోడ్డు వెంట పరుగే నడకగా సాగింది. దూరంగా ప్రధానాశ్రమం చుట్టూ వ్యాపించిన భవన సముదాయం కనిపిస్తోంది.

పది నిమిషాలు నడచిన తరువాత రోడ్డు పక్కన పెద్ద మందిరమొకటి ప్రత్యక్షమైంది. దాని చుట్టూ భక్తజన సందోహమూ కనిపించింది.

తోటి మానవుల్ని చూడగానే కొంత ధైర్యం చేకూరినట్టయింది ఆమెకు.

అలసటతో రొప్పుతూ దారి పక్కన కనిపించిన సిమెంటు బెంచీ పైన కూలబడింది.

"చిన్నాజీని కలవాలని వచ్చారా మీరు" అన్న కీచుకంఠమొకటి వినిపించింది. నిఖిత పెద్దగా ఉలిక్కిపడుతూ పక్కకు తిరిగిచూసింది.

3

పెద్ద పెద్ద బండరాళ్ళతో నిండిన గుట్ట పక్కన విశాలమైన మైదానంలో అక్కడక్కడా పాదులు చేసి పెంచుతున్న మొక్కలు కనిపిస్తున్నాయి. కొండ సానువుల్లో రాళ్ళతో వేదికను కట్టి, దానిపైన మూడు పెద్ద నిట్రాళ్ళు నిలబెట్టి, ఆపైన బోదతో కప్పి చిన్న ఆశ్రయాన్ని తయారు చేశారు. గోడలు లేని ఆశ్రయం నేలపైన మూరెడెత్తుతో సిమెంటు గోడను కట్టారు. నేలపైన జంబులీగలతో తయారు చేసిన చాపలు పరిచారు. ఆశ్రయానికంతా కేంద్రంలా ఓ సన్యాసి పద్మాసనమేసుకుని కూర్చుని ఉన్నాడు. తెలుపు నలుపులు సమ పాళ్ళలో కలగలసినట్టున్న అతడి జటాజూటం అతడి వయసును తెలియజేస్తోంది. వంగిన వెన్నెముకతో గూడులా ఒరిగిన అతడి శరీరం చిన్న తెమ్మెరకే ఊగిసలాడే వెదురు కొమ్మలా ఎగసెగసి పడుతోంది. ఒంటికి చుట్టుకున్న కాషాయ రంగు వస్త్రాలు ఈదురు గాలికి అల్లల్లాడుతున్నాయి.

ఆశ్రయానికి బయట, మైదానంలో పాతిక మందికి తక్కువగాని సాధువులు కళ్ళు మూసుకుని ధ్యానంలో మునిగిపోయి ఉన్నారు.

రెండు రోజుల క్రితం కురిసి వెళ్ళిన వర్ష ప్రభావంతో ఇంకా కీచురాళ్ళు నవ్వడి చేస్తున్నాయి.

"చెప్పండి స్వామీ. చిరంజీవి ఎక్కడ?" ఆశ్రయంలోని సాధువుకెదురుగా మటమేసుకుని కూర్చున్న నిఖిత అసహనంగా ప్రశ్నించింది.

"యువ స్వామీజీ నుడువలేదా మీతో" అంటూ అతగాడు ప్రశ్ననే సంధించాడు.

"చెప్పే ఉంటే ఇక్కడికెందుకు వచ్చేదాన్ని? యువ స్వామీజీ చెప్పనే చెప్పాడు, చిన్నాజీ ప్రధానాశ్రమంలో ఉన్నాడని. ఈ కొత్త మనిషి మాటలు నమ్మి ఇలా రావడమే నా పొరబాటు..." ఆమె చెప్పుకుపోసాగింది.

"ఇంకా యువ స్వామీజీ ఏమని పలికారు" అంటూ అతను అడ్డు తగిలాడు.

నిఖిత విస్మయపడుతూ కాసేపు ఆగి, "రేపు సాయంత్రం లోగా చిన్నాజీ ప్రాణం గుటుక్కు మంటుందని అన్నాడు. స్వామీజీ చెప్పిన మాటను ఆచరణలో పెట్టడమే తన కర్తవ్యమన్నాడు. యముడైనా అడ్డుపడలేడని అన్నాడు" అంది.

"అందుకు యముడే దిగిరావాలా? అంతకు మించిన మహర్షులు ఈ లోకంలో ఉండరా" అన్నాడతను, ఒక మాట తరువాత ఒకదాన్ని స్పష్టంగా ఉచ్ఛరిస్తూ. నిఖిత పెద్దగా ఉలిక్కిపడింది.

బక్కచిక్కిన అతడి ముఖంపైన, పొడుచుకొచ్చిన ఎముకలాగున్న ముక్కు కింద, పొడవాటి బవిరి గడ్డంలోని వెంట్రుకలు అటూ ఇటూ కదలడంతో అతడు నవ్వుతున్నాడేమోననిపిస్తోంది. ప్రమిదల్లాంటి గుంటల మధ్య నుంచి అతడి కళ్ళు దీపకిరణాల్లాంటి తీక్షమైన చూపుల్ని రువ్వుతున్నాయి.

"వారింకా ఏమని పలికారు? సత్యం పలుకు."

అతడి మాటల ధోరణికి ఆమె మరింత విభ్రాంతురాలైపోతూ, "నాకు మంత్రోపదేశం చేస్తానన్నాడు. ఇక్కడ జరగబోయే సంభవాన్ని గురించి పత్రికల్లో బాగా రాయమని సలహా ఇచ్చాడు" అంది.

"సంభవమే జరగకపోయినప్పుడు ఏమని వ్రాయమన్నారు?"

ఉలిక్కిపడడం అలవాటైపోయినట్టుగా ఆమె శరీరం ఎగిరిపడింది.

"జరగదంటారా మీరు? నిజమా? చెప్పండి ప్లీజ్" అంటూ ప్రాధేయపడింది.

"ఈ ఆశ్రమ ఆవరణలో, ఈ కుమారస్వామి అనుజ్ఞ లేనపుడు చీమయినా కుట్టదు. స్వామీజీ నగర పాలనను మా హస్తాలలో ఉంచారు" అన్నాడతను.

"ఇక్కడ తన మాటే ఆజ్ఞ అనే అన్నాడు యువ స్వామీజీ కూడా" అంది నిఖిత ఒదిగుళ్ళు పోతూ.

"ప్రధానాశ్రమంలోనే వారి తాండవం. స్వామీజీ తమ పలుకులే విశ్వసిస్తారని వారి ధీమా! ఆశ్రమం వెలుపల వారికంటే ధీటయిన శక్తి మరొకటి వెలుగుతున్నట్టు వారు గ్రహించడం లేదు."

"ఆయన ధోరణి చూస్తే నాకు భయమేసింది. రేపు సాయంత్రం లోపున చిరంజీవికి సహజ మరణం సంభవించకపోతే, ఆ పని ఆయనే ఎలా గోలా చేయించేటట్టున్నాడు" అందామె భయంతో వణకుతున్న గొంతుకతో.

"వారందుకు సమర్థులే! స్వామీజీకంత విశ్వాసం ఊరికే కలగదు. యువ స్వామీజీ సామాన్యులు కారు."

"అయితే చిరంజీవి..." ఆమె గొంతు మరింతగా జీరబోయింది.

"చిన్నాజీకీ, తమకూ సంబంధమేమిటి?" అతడి గొంతుకలో ఎటువంటి మార్పూ రాలేదు.

"బెంగళూరు కాన్ఫరెన్స్‌లో నాలుగు రోజుల పరిచయం. అంతే!"

"అంతమాత్రానికే ఇంతగా ఆందోళన చెదుతారా ఎవరైనా?"

"అంతే! ఇంకేమీ లేదు..."

"విశ్వాసం కలగడం లేదు."

"పెద్ద మాథమాటికల్ జీనియస్. లోకానికి పనికొచ్చే మనిషి..."

"ఆ మేధను తయారు చేసిందెవరు?"

"మేధను తయారు చేయడం కుదురుతుందా? పదహారేండ్ల వరకూ ఆ శక్తి అతడిలో నిగూఢంగా ఉండి ఉంటుంది. ఎవరో నిద్ర లేపారు. తన శక్తి తనకు తెలిసిన తర్వాత అతను తీవ్రమైన ప్రాక్టీసులో మునిగిపోయాడు. అంచెలంచెలుగా అతడి బుద్ధి పదునెక్కింది. ఇంకా దానికో శాస్త్రీయ రూపాన్నివ్వలేక అతను తనకలాడిపోతున్నాడు. అదీ నిజం!"

"ఆ శక్తి నిద్ర లేపిందెవరు? ఆ శక్తి ఆయనలో మాత్రమే నిద్రాణమై ఉండడానికి కారకులెవరు? అంతా స్వామీజీ మయం జగత్!"

ఆమె మనసంతా కకావికలైనట్టుగా తోచింది.

కాసేపటి తర్వాత శక్తిని కూడగట్టుకుని, "యువ స్వామీజీ రెకమెండేషను దొరికిన తర్వాతే స్వామీజీ అనుగ్రహం దొరికిందట ఆయనకు" అంది.

"అబద్ధం." కుమారస్వామి బలహీన శరీరం కోపంతో ఊగిపోసాగింది. "ఇందులో వారి ప్రమేయం లేదు. ఈ అసత్య ప్రచారాన్ని చేయిస్తున్నవారెవరో మాకు తెలుసు. రేపు ఆ సంభవం జరగకుండా ఆపడమెలాగో మాకు బాగా తెలుసు."

"మీరు ఆపగలరా?" ఆమె ప్రశ్నించింది.

"అనుమానమా? మేమే పూనుకోకపోయి ఉండినట్టయితే, చిన్నాజీ ఎప్పుడో అవతార సమాప్తి చేసి ఉండేవారు."

"........"

"మూడు మాసముల క్రితం చిన్నాజీ గారికి మదరాసులో పెద్ద కారు ప్రమాదం తప్పింది. జ్ఞాపకం ఉందా మీకు! తప్పించిన వారు మా అనుచరులే కదా!"

నిఖిత ధ్యాన ముద్రలలో కూర్చున్న వ్యక్తులకేసి చూస్తూ, "వీళ్ళంతా మీ అనుచరులా" అని అడిగింది.

అతను తల ఊపుతూ, "ఆరు మాసముల నుంచీ ఆ ప్రయత్నాలు సాగుతున్నాయి. కానీ, మా అనుచరులు అప్రమత్తంగా చిన్నాజీని కాపాడుతూ వస్తున్నారు. తమ మందిరాల చుట్టూ రక్షణ కార్యంలో ఉన్న సత్సంగీయులందరూ మా అనుచరులన్న విషయం వారికి కూడా తెలుసు. అందుకే బోనులో చిక్కిన సింహాల్లా విలవిలలాడిపోతున్నారు" అన్నాడు.

"చిన్నాజీ మరణం వల్ల లాభం ఎవరికి?" ఆమె ప్రశ్నించింది.

"ఎవరికో తమకింతవరకూ తెలిసిరాలేదా?"

"గడచిన ఆరు నెలలుగా చిన్నాజీ అవతార సమాప్తిని గురించిన వార్తలు వింటున్నాం. అంతకు మునుపెందుకీ ప్రయత్నాలు జరగలేదు? ఈ ప్రయత్నాలు చేస్తున్నదెవరు? మీరు దాన్నెందుకు ఆపాలని అనుకుంటున్నారు?"

కుమారస్వామి మెల్లగా నిట్టూర్చాడు. "అంతా మాయ! అన్ని ప్రశ్నలకూ సమాధానాలు మీ వంటివారికి గోచరించవు. అందుకు ప్రాప్తం ఉండాలి" అన్నాడు.

"మీ అనుచరులంతా సాధువులే గదా! వీళ్ళకు ప్రమాదాలు ఆపేటంత శక్తి ఎక్కడుంది" అని ఆమె అడిగింది.

కుమారస్వామి వెనక్కు తిరిగి చేయి ఊపాడు. దూరం నుంచి ఓ సాధువు పైకి లేచి ఆశ్రమం దగ్గరికి నడచి వచ్చాడు.

"సాధకా! ఆ కొండనధిరోహించి, ఆ పెద్ద బండరాతిని కిందికి దొర్లించు" అంటూ గుట్టకేసి చేయి చాపాడు.

అతను తల ఊపుకుంటూ గుట్టపైకెక్కాడు.



నిఖిత ఆశ్చర్య పడుతూ చూడ సాగింది.

అయిదు నిమిషాల తర్వాత అతనో పెద్ద గుండును సమీపించాడు. బలమంతా ఉపయోగించి దాన్ని నెట్టసాగాడు. ఎంతకూ బండ కదలడం లేదు.

"సాధ్యం కాదని తెలిసినా అతడెందుకలా ప్రయత్నిస్తున్నాడు" అని అడిగింది ఆమె.

"అది అసాధ్యమని అతననుకోవటం లేదు."

"కారణం?"

కుమారస్వామి మరోసారి చేయి ఊపాడు.

సాధువు తన ప్రయత్నాన్ని ఆపేసి కిందికి దిగసాగాడు.

"సాధకుడినలాగే కిందికి దుమకమని చెప్పనా" అంటూ కళ్ళెగరేశాడు కుమారస్వామి.

"అయ్యయ్యో. చస్తాడేమో!" నిఖిత కెవ్వున అరచింది.

అతను దగ్గరికి రాగానే, "సాధకా, ఆత్మార్పణకు అనుజ్ఞ రాబోతోంది" అన్నాడు కుమారస్వామి.

సాధువు "సిద్ధం స్వామీ" అన్నాడు.

"చస్తావు." కంగారుగా అంది నిఖిత.

"చావు శరీరానికే! ఆత్మకు కాదు."

"మరణం తర్వాత జీవితముందని నమ్ముతున్నావా?"

"లేదని మీరనుకుంటున్నారా?"

"ఉందనడానకి సాక్ష్యమేముంది?"

"లేదనడానికి సాక్ష్యమేది? స్వామీజీ సేవలో శరీరాన్ని విడిచిపెడితే స్వర్గద్వారాలు తెరుచుకుంటాయి."

శిష్యుడి సమాధానం వింటూనే కుమారస్వామి "శభాష్" అంటూ మెచ్చుకున్నాడు.

"స్వర్గం అంటే?" నిఖిత సాలోచనగా ప్రశ్నించింది.

"మళ్ళీ పుట్టుక లేకపోవటం..."

"స్వర్గంలో ఉండిపోయి ఏం చేస్తావు?"

"భగవంతుడి సేవలో తరిస్తాను."

"ఇంకా?"



**"చిన్నాజీకి చిన్నప్పటి నుంచీ ఆస్మా ఉందని తెలుసు మీకు. అది బాగా ముదిరి పోయిందనీ, దాంతో ఆయన చాలా రోజులు బతకడు లెమ్మనుకున్నారు."**

"అనంతమైన ఆనందాల్లో మునిగిపోతాను."

"ఆనందం అంటే?"

"కోరుకున్నంత రాసలీల. అందుకోవాలన్నంత మధుపానం."

కుమారస్వామి సాధువుకేసి ప్రసన్నంగా చూస్తూ, వెళ్ళమన్నట్టుగా సైగ చేశాడు.

సాధువు మరబొమ్మలా వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

"ఇది ఘోరం. ఈ మాటలు ఏ వేదాంత పుస్తకంలోనూ లేవు" అంటూ వాపోయింది నిఖిత.

"వీరికంతా మా మాటే వేదం. ఆత్మార్పణకు సన్నద్ధమైన సాధకులే మా సైన్యం. మరణానికి వెరవనివారికంటే శక్తివంతమైన ఆయుధం ఈ భూప్రపంచంలో పుట్టలేదింకా! తుపాకులూ, బాంబులూ వీరి గుండె ధైర్యం ముందు బలాదూరు. స్వామీజీతో కలసి యువ స్వామీజీ ఒక చిన్నాజీని తయారు చేశారు. మేము ఒక్కరమే ఇందరు సాధకులను రూపొందించాము" అన్నాడతను గంభీరంగా.

"మీ సాధకులకింత శక్తి ఎక్కడి నుంచి వచ్చింది?" ఆమె విస్తుపోతూ ప్రశ్నించింది.

"సాధన, భక్తి, గురు బోధ పైన విశ్వాసం, ఏకాగ్రత" అన్నాడతను నెమ్మదిగా.

"ఆధ్యాత్మిక దృష్టితో ఉండాల్సిన సాధువుల్ని ఈ రీతిగా మార్చడం న్యాయమేనా?"

"ఇదీ ఆధ్యాత్మికతే!"

"కాదు."

"మరింకేమిటి?"

"అదే అర్థం గావడం లేదు."

"దాన్నే మాయ అంటారు."

"కాదు. అవన్నీ పడికట్టు మాటలు. ఈ మాటల ఇంద్రజాలంలోనే మీ సాధకులూ పడిపోయారు. కానీ, కానీ నిజం ఏమిటి?"

"సత్యాన్వేషణకు మీకో అవకాశం ఇస్తాం. యువ స్వామీజీ మీతో పలికిన సంగతులన్నీ మాకు విన్న వించుకోండి. శిష్యురాలిగా అనుగ్రహిస్తాం."

"అంతా చెప్పేశాను గదా మీకు."

కాసేపు ఆలోచించిన తరువాత, "మంచిది. స్వామిమయం జగత్. మళ్ళీ మీకు యువ స్వామీజీ నుంచి పిలుపు రావచ్చు. మీకు అందిన సమాచారాన్నంతా మాకు అందజేయండి. గొప్ప ప్రతిఫలం అందుతుంది... ఆధ్యాత్మిక ప్రతిఫలం!"

కుమారస్వామి చేయి మళ్ళీ గాలిలోకి లేచింది.

వయసెంతో తేల్చి చెప్పడానికి వీల్లేని శరీరంతో ఉన్న సాధువొకడు ఆశ్రమం దగ్గరికొచ్చాడు.

వెళ్ళిరమ్మన్నట్టుగా కుమారస్వామి చేయి ఊపాడు. కంచుతో పోతపోసిన విగ్రహంలా కనబడుతున్న సాధువు చకచకా నడచిపోతున్నాడు. గురువాజ్ఞ తప్ప మరొక దానిమీద లగ్నం లేనట్టుగా అతడి పాదాలు ముందుకు కదులుతున్నాయి.

పదిహేను నిమిషాల నడక తర్వాత ఆశ్రమ ఫలహారశాల దగ్గరికి చేరారు వాళ్ళిద్దరూ. 'ఇక మీ ఇష్టం వచ్చినట్టు వెళ్ళొచ్చు' అన్న అర్థం స్ఫురించేలా అతనో చిత్రమైన సైగ చేసి, వెనుదిరిగి వచ్చిన దారిలోనే వెళ్ళిపోయాడు.

వెనక నుంచి అతడినే గమనిస్తూ విస్మయ చకితురాలైపోయింది నిఖిత.

ఇంతలో "చిన్నాజీ మిమ్మల్ని పిలుస్తున్నారు" అంటూ ఓ సాధువు ఆమె ముందుకు వచ్చాడు.

**4**

దర్బారు హాలులా విశాలంగా ఉన్న మందిరం గోడలకంతా పూలమాలలు వేలాడుతున్నాయి. పై కప్పు నుంచి రంగురంగుల షాండిలీర్లు దీపపుష్పాల్లా ఊగుతున్నాయి. గోడలపైన దేవుళ్ళ నిలువెత్తు చిత్రపటాలు సజీవమూర్తులేమోనన్న భ్రమను కలిగిస్తున్నాయి. హాలు సింహద్వారం దగ్గర రెండు పెద్ద ఏనుగు ప్రతిమలు నిలబెట్టబడి ఉన్నాయి. గోడలకున్న అద్దాల కిటికీ లోంచి బయట అందంగా పెంచబడుతున్న ఉద్యానవనం కనిపిస్తోంది. కిటికీల లోంచి ఆశ్రమం చుట్టూ కాపలా కాస్తున్న సాధువులు గూడా కనిపిస్తున్నారు.

మందిరానికో చివర్లో, వేదిక పైన అమర్చిన బంగారు మలామా నగిషీల సింహాసనం పైన లావుపాటి సన్యాసి ఆసీనుడై ఉన్నాడు. ఆయన పెద్దగా శబ్దం చేస్తూ ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వదిలి పెడుతూ ఉండడంతో, ఆయన కట్టుకున్న కాషాయ రంగు పట్టు వస్త్రమూ, కప్పుకున్న కాషాయ రంగు కాశ్మీరు శాలువా ఎగసెగసి పడుతున్నాయి. నెరిసిన వెంట్రుకలూ, తెల్లటి పట్టుకుచ్చులాంటి గడ్డమూ అతడి ముఖంలోని చాలా భాగాన్ని కప్పేశాయి. కనిపిస్తున్న కొద్దిపాటి భాగమూ గోధుమ రంగులో మినమినా మెరుస్తోంది. ఆయన పాదాలు మోపిన చిన్న పీటికకూ, పాలరాతి నేలకూ మధ్య ఎర్రటి తివాచీ డాబుసరిగా వెలుగుతోంది.

వేదిక ముందు నేలపైన కూర్చున్న నిఖిత స్వామీజీకెదురుగా, మందిరానికి మరో చివర్లో ఉన్న మండపం కేసి తదేక దీక్షతో చూస్తోంది.

మండపంలో దేవతా ప్రతిమల ముందు కూర్చుని ధ్యాన నిమగ్నుడైనట్టుగా కళ్ళు మూసుకుని ఉన్నాడో యువకుడు. అతడి తెల్లటి పట్టు అంగవస్త్రం పైన రోజా పూలమాల కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది. అతడికి నాలుగైదు గజాల దూరంలో ఇద్దరు నడివయసు స్త్రీలూ, ముగ్గురు మగవాళ్ళూ గుంపుగా కూర్చుని ఉన్నారు. మరో ఇద్దరు పూజారిణులు మండపంలో పూజా సామగ్రిని అమరుస్తున్నారు.

"స్వామీజీకేమైనా... చెప్పుకోవాలంటే చెప్పుకో వచ్చు" అన్నాడు సింహాసనం పైన కూర్చున్న సన్యాసి బొంగురుపోతున్న కంఠంతో.

నిఖిత చుట్టూ ఓసారి తల తిప్పి చూశాక బిక్కమొహం పెట్టింది. సన్యాసి మళ్ళీ అదే ప్రశ్నను సంధించాడు. అప్పటికిగానీ ఆయన తనను తాను స్వామీజీ అని పిలుచుకుంటున్న సంగతి ఆమెకు స్ఫురించలేదు.

"చిరంజీ... చిన్నాజీతో మాట్లాడొచ్చా ఒకసారి" అంటూ తడారిపోతున్న గొంతుకతో ప్రశ్నించింది నిఖిత.

"ఆయన దీక్షలో ఉన్నాడు. మూడు రోజుల మౌనవ్రతం. ఇహలోకానికి సంబంధించినవేవీ ఇప్పుడాయనకు కాబట్టవు. ఒక్క పొద్దు" అన్నాడు స్వామీజీ ఊపిరి తిప్పుకోవడం కోసం మాటల మధ్య విరామాల్ని పెంచుకుంటూ.

"చిన్నాజీ రేపు సాయంత్రం లోగా..." ఆమె వాక్యాన్ని సగంలోనే ఆపేసింది.

"అంతా స్వామీజీ తలంపు. వేచి చూడు" అన్నాడతను ఆయాసంతో రొప్పుతూ.

"నీ గురించి చెప్పుకో! స్వామీజీ దయ కలుగుతుంది. నీ తల్లితండ్రుల కోరికలు, నీ కోరికలు అన్నీ చెప్పుకోవచ్చు."

"మా అమ్మా, నాన్నా హైదరాబాదులో ఉంటారు." చీకట్లో దారిని వెతుక్కుంటున్నట్టుగా తడబడుతూ చెప్పసాగింది ఆమె.

"డాడీ రిటైరై చాలా రోజులైపోయింది. నేనీ ప్రొఫెషనులో చేరి నాలుగేళ్ళయిపోయింది. జీతం ఫరవాలేదు. కానీ, మరి చిన్నాజీ..."

దూరంగా మండపంలో కూర్చున్న చిరంజీవి కళ్ళు తెరిచి చూశాడు. నిఖిత కనబడగానే అతడి ముఖం వివర్ణమైపోయింది. బలవంతంగా మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

నిఖిత మెల్లగా నవ్వింది.

స్వామీజీ ముఖంలో సైతం నీడలు కదలాడాయి. "చిన్నాజీ ఆశ్రమంలో విలువైన సంపద... అతనికి కష్టం కలిగే పనేదీ ఇక్కడ జరగకూడదు" అన్నాడతను.

"నేలాంటిదేమీ ఎవరితోనూ అనలేదు" అంది నిఖిత గబాలున.

"ఇకపైన కూడా సత్ప్రవర్తనతో ఉండాలి" అన్నాడతను వెంటనే. నిఖిత మళ్ళీ ఒకసారి

చిరంజీవి కేసి చూస్తూ నవ్వును పొడిగించింది.

"అంతా లీల... కృష్ణ భగవానుడి లీలలు ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవాలి" అన్నాడు స్వామీజీ మరింత పెద్దగా రొప్పుతూ.

"లోకంలో సైంధవులూ, ఉత్తరకుమారులూ లీలలు చూపిస్తున్నారు స్వామీ" అంటూ ఏదో చెప్పబోయి, అంతలోనే సర్దుకుంది నిఖిత. "అంత విలువైన మనిషని తెలిసీ ఆయన ఆయుస్సును తగ్గించారా మీరు" అంది అయోమయంగా.

"అంతా పూర్వ జన్మ సుకృతం."

"మనిషంత ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు. రేపటిలోగా అదెలా సాధ్యం?"

స్వామీజీ కిటికీలోంచి బయటికి చూశాడు. సాధువులు గస్తీ తిరుగుతున్నారు.

విసుగ్గా దూరంగా కూర్చున్న వ్యక్తులకేసి చేయి ఊపాడు.

దగ్గరికి పరుగు పరుగునా వచ్చిన వ్యక్తి చెవిలో ఏదో గొణిగాడు.

"యువ స్వామీజీ మీ మాట తప్పదని అన్నారు నాతో! కానీ, కుమారస్వామి మాత్రం అందు కొప్పుకోలేదు. ఇద్దరూ మీ శిష్యులే గదా! ఇందులో ఏది నిజం?" ఆమె మళ్ళీ ప్రశ్నించింది.

స్వామీజీ ముఖం కుంచించుకుపోసాగింది. ఆయన శరీరం పైన విచిత్రంగా చెమట బిందువులు పొటమరించాయి.

ఇంతలో మందిరానికి అమర్చిన ఏసీ మిషను తన నవ్వడిని పెంచుకోవడం నిఖితకు స్పష్టంగా బోధపడింది.

"నీ గురించి స్వామీజీకి చెప్పుకో. తనది మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అన్నాడతను గొంతులో వణుకు పెరుగుతుండగా!

"బెంగుళూరు కాన్ఫరెన్సులో చిన్నాజీకి గొప్ప సన్మానం జరిగింది." నిఖిత ముఖం చిట్లించు కుంటూ చెప్పసాగింది. "అప్పుడు నేనాయన్ను ఇంటర్వ్యూ చేశాను. హోటలు గదిలో జరిగిందా ఇంటర్వ్యూ."

"నీకిచ్చిన సమయం అయిదు నిమిషాలు మాత్రమే!" స్వామీజీ అసహనంగా ఆమె మాటలకడ్డు తగిలాడు.

"కుమారస్వామి ఇంకా ఏం చెప్పాడు నీతో!"

"పెద్దగా ఏమీ చెప్పలేదు" అంది నిఖిత తన మాటల్ని తానే సరితూచుకుంటున్నట్టుగా.

"తన అనుచరులనంతా చూపెట్టాడు. తలా ఒక చిన్నాజీలా కనిపించారు వాళ్ళు నాకు. నమ్మకం వల్ల మామూలు మనిషికి గూడా ఎంత బలం వస్తుందో చూడ్డానికే ఆశ్చర్యంగా ఉంది నాకు. ఇదేదో వింత అద్భుతం. వింత."

"నమ్మకం కుదరాలంటే దైవ కృప ఉండాలి." గానుగ మర లోంచి వెలుపలకొచ్చే చెరకు పిప్పిలా నిస్సారంగా వెలువడింది స్వామీజీ గొంతు.

"మీ శిష్యులిద్దరూ తలో రకం నమ్మకంలో ఉన్నారు. ఇద్దరిలో గెలిచేదెవరు" అంది ఆమె తల ఊపుతూ.

స్వామీజీ పెద్దగా ఊపిరి పీలుస్తూ ఆసనంలోనే ఆపసోపాలు పడసాగాడు.

నిఖిత చిరంజీవి వైపుకోసారి చూశాక, "జాతరలో బలికి సిద్ధం చేసిన గొర్రెలా ఉన్నాడు" అంటూ మెల్లగా గొణుక్కొంది.

"ఏమిటి? పెద్దగా చెప్పు" అంటూ కంపిస్తున్న కంఠంతో అడుగుతూ, అలాగే ఆసనం పైన సోలి పోయాడు స్వామీజీ. ఆయన తల ఓ వైపునకు ఒరిగిపోయింది. పాదాలు పీఠిక పైన్నుంచి తప్పుకుని గాలిలో వేలాడుతున్నాయి.

నిఖిత ఉలిక్కిపడి పైకి లేచి స్వామీజీ దగ్గరికి పరుగెత్తింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని, కంగారుగా అతని ముఖంలోకి తొంగి చూసింది. మూసుకుపోతున్న కళ్ళను అతి కష్టం పైన తెరవడానికి ప్రయత్నిస్తూ ఓసారి నిఖితకేసి అదోలా చూశాడు స్వామీజీ. ముఖమనే ఇనుప తెరను తొలగించుకుని ఏదో కొత్త ఆకారం ఓ క్షణం సేపు అతడి లోంచి బయటికి తొంగిచూసినట్టనిపించింది నిఖితకు.

బెంగుళూరు హోటల్లో విచలితుడై, నిస్సహాయుడిలా కుప్పకూలిన చిరంజీవి రూపం మళ్ళీ ఓసారి ఆమె మనసులో మెదిలింది.

ఇంతలో స్వామీజీ కళ్ళు పూర్తిగా మూతబడ్డాయి.

దూరంగా మండపం దగ్గర కూచున్న వ్యక్తుల్లో కలకలం చెలరేగింది. హాలుకవతలి పక్కనున్న గదిలోంచి ఇద్దరు సాధువులు పరుగు పరుగునా స్వామీజీ దగ్గరికొచ్చారు.

"అపచారం అపచారం. స్వామీజీని తాకరాదు" అంటూ నిఖితను మందలించాడొకడు.

"స్వామీజీ దివ్య మాయలోకి వెళ్ళారు. అలా కాసేపు విహరించి వస్తారు. నువ్వు బయటికెళ్ళు వెంటనే" అంటూ అరిచాడు రెండవ వ్యక్తి.

స్వామీజీ చేతిని అలాగే ఆయన శరీరం పైన ఉంచేశాక, వెనుదిరిగి మందిరం మధ్య దాకా నడచి వచ్చింది నిఖిత. అక్కడే కాసేపాగి మందిరానికి రెండు చివరల్లో కనిపిస్తున్న వ్యక్తులిద్దరినీ మార్చి మార్చి చూసింది.

స్వామీజీ శరీరాన్ని అలాగే పైకెత్తుకుని లోపలి గదిలోకి మోసుకెళ్తున్నారు సాధువులిద్దరూ.

దీక్ష నుంచి పైకి లేచే శక్తి లేకపోవడంతో దీనంగా బిక్కుబిక్కుమని చూపులు సారిస్తున్నాడు చిరంజీవి.

## 5

కార్తీక మాసపు చంద్రుడి నీలిరంగు కాంతిలో 'మృత్యుంజయాశ్రమం' పరిసరాలతో సహా గడ్డకట్టుకుపోయి, స్థాణువులా మారిపోయినట్టు కనిపిస్తోంది. చెట్లు సైతం ఆకులల్లార్చడం లేదు. ఆశ్రమ పరిసరాల్లో వెలుగుతున్న వీధి లైట్ల దగ్గర దీపం పురుగుల సందడి గూడా కానరావడం లేదు. ప్రధానాశ్రమం చుట్టూ, దాదాపు నూరు గజాల కవతల గుంపుగా కూర్చున్న వేలాది మంది భక్తులూ శిలాప్రతిమల్లా కూర్చుండిపోయారు. ఉద్యానవనంలో నిల్చున్న సాధువులు సైతం ఆశ్రమ రక్షణ వ్యవహారాన్ని పట్టించుకోకుండా ఎక్కడివాళ్ళక్కడ కూలబడిపోయి ఉన్నారు. ప్రధానాశ్రమం తలుపులు మసివేశారు. అద్దాల కిటికీలకు అడ్డంగా తెరలు దిగిపోయాయి. లోపలేం జరుగుతోందో బయటికి కనిపించడం లేదు. భక్తజనం కళ్ళార్పడం గూడా మరచిపోయి ప్రధానాశ్రమం కేసి చూస్తున్నారు.

జన సమూహానికి దూరంగా సిమెంటు బెంచీ పైన కూర్చున్న నిఖిత, "ఏం జరుగుతోందక్కడ? నిన్న సాయంకాలం నుంచీ జనం బయట పడిగాపులు పడుతున్నారెందుకు? ఎంతకూ లోపలి నుంచి సమాచారమేదీ అందడం లేదెందుకు" అంటూ ఆందోళనగా ప్రశ్నించింది. ఆమె పక్కన కూర్చున్న సంతోష్, "రేపు సాయంకాలమని అనుకున్న సంభవం తెల్లారే లోపలే జరిగేటట్టుంది" అన్నాడు ఉత్కంఠతో ఊగిపోతూ.

"అక్కడేదో గూడుపుఠాణీ జరుగుతోంది." నిఖిత గొంతుక జీరబోసాగింది. "సంభవమో, మహత్యమో అందరి ముందూ జరగాలి గానీ ఇలా రహస్యంగా జరగడమేం న్యాయం! ఏదో మోసం జరుగుతోంది. లోపలేదో అఘాయిత్యం జరిగిపోతోంది. చివరకు మనిపూసి మారేడు కాయను చేస్తారేమో! చిరంజీవిది సహజ మరణమని నమ్మించేస్తారేమో! ఈ జనాలెందుకలా కట్టు కదలకుండా కూర్చున్నారు? తలుపులు పగలగొట్టుకుని ఆశ్రమం లోపలి కెందుకెళ్ళడం లేదు."

"స్వామీజీ పర్మిషను లేకుండా ఎవరూ ముందుకెళ్ళరు" అన్నాడు సంతోష్ ఉద్వేగంగా.

"మూర్ఖత్వం." పెద్దగా అరిచింది నిఖిత.

"పెద్దగా అరవద్దు. డివోటీస్ విన్నారంటే డేంజరు" అంటూ విసుక్కున్నాడు సంతోష్. "ముందే భక్తితో ఊగిపోతున్నారు అంతా!"


"భక్తిగాదు. భయం." వీలయినంత మెల్లగా మాట్లాడడానికి ప్రయత్నించింది ఆమె.

ఉన్నట్టుండి ఆశ్రమం ద్వారాలు తెరచుకున్నాయి. యువ స్వామీజీ భారంగా అడుగులు వేస్తూ వెలుపలికొచ్చాడు.

సాధువులు కొందరు ఆయన దగ్గరికి వెళ్ళారు.

అయిదారు నిమిషాల సేపు వాళ్ళతో మంతనా లాడిన తర్వాత యువ స్వామీజీ తిరిగి లోపలికెళ్ళిపోయాడు.

మళ్ళీ ప్రధానాశ్రమ ద్వారాలు మూసుకు పోయాయి. సాధువులు భక్తుల దగ్గరికొచ్చి మెల్లగా ఏదో చెబుతున్నారు. జనంలో అలజడి మొదల యింది. సాధువులు బిగ్గరగా ఏదో అరుస్తున్నారు. జనంలోంచి భజన ప్రారంభమైంది. రానురానూ అది పెద్దగా వినబడసాగింది.



హృదయాల్లోంచి తన్ను కొచ్చినట్టుగా వాళ్ళ భజన ఉద్వేగంతో సాగిపోసాగింది.

"సంభవం జరిగిపోయినట్టుంది. ఎంక్వయిరీ చేసి వస్తాను" అంటూ పైకి లేచాడు సంతోష్.

"అయ్యయ్యో! నిండు ప్రాణం బలైపోయినట్టేనా?" నిఖిత ఆక్రోశించింది.

సంతోష్ ఆమె వైపుకు ఉరిమి చూస్తూ జనం దగ్గరికెళ్ళాడు. నిఖిత పైకి లేచి కాలుగాలిన పిల్లిలా అక్కడే తచ్చాడసాగింది.

రాయీ రాయీ కొట్టుకునే ఆ అపరాత్రి వేళలో, భక్తుల భజన కార్చిచ్చులో గొల్లుమనే అడవి జంతువుల గోలలా విచిత్రంగా ధ్వనించసాగింది.

అయిదు నిమిషాల తరువాత సంతోష్ తిరిగొచ్చాడు. అతని చెంపల పైన కన్నీళ్ళు స్రవిస్తు న్నాయి. "స్వామీజీ ఈజ్ ది గ్రేటెస్ట్! తన బాడీని

వదలిపెట్టి ఏదో ముఖ్యమైన పనికోసం వెళ్ళారు" అన్నాడు. నిఖిత అయోమయంగా చూసింది.

"ఎవరైనా డివోటీలు కాపాడమని ప్రేయర్ చేసినప్పుడు స్వామీజీ ఇలా ఫిజికల్ బాడీని విడిచిపెట్టి వెళ్ళిపోతారు. ఆయన తిరిగొచ్చేవరకూ భజన జరగాల్సిందే" అన్నాడతను.

"చిరంజీవి సంగతేమిటి" అంది నిఖిత విసుగ్గా.

సంతోష్ ఆమె మాటల్ని గమనించకుండా భజనతో గొంతు కలపసాగాడు.

"మీ స్వామీజీకి హై బీపీ. శిష్యులిద్దరూ ఇరుకున పెట్టడంతో టెన్షనులో పడి కొట్టుకుంటున్నాడు. బహుశా డాక్టరు దగ్గర ట్రీట్‌మెంట్ చేయించు కుంటూ ఉంటాడిప్పుడు" అంది ఆమె.

"మీ హ్యూమన్ బ్రెయిన్లకుండే కెపాసిటీ అంతే! దానికి అందని సీక్రెట్లెన్నో ఉన్నాయీ లోకంలో" అన్నాడు సంతోష్ వెక్కిళ్ళ మధ్య.

భక్తుల భజన పాటలో పడి కొట్టుకుపోతున్న ఓటి పడవలా ఉంది ఆశ్రమం.

నడిరాతిరి ఆకాశం కిందికి దిగి ఆశ్రమం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించినట్టుంది.

"ఇక్కడింత అన్యాయం జరుగుతుంటే పోలీసు లేమయ్యారు? ప్రభుత్వమేమయింది" అంటూ ఆక్రోశించింది నిఖిత.

"అక్కడుండే భజన బృందంలో ఎందురు ఆఫీసర్లూ, లీడర్లూ ఉన్నారో తెలుసా మీకు! గొప్పగొప్పవాళ్ళే సౌల్యాషను వెతుక్కుంటూ ఆశ్రమం చేరుకుంటారు" అన్నాడు సంతోష్ గొంతులో ఏడుపు తన్నుకొస్తుండగా. అతడి వెక్కిళ్ళను నివ్వెరపోయి వినసాగింది నిఖిత.




చాలా సేపటి తర్వాత మళ్ళీ ప్రధానాశ్రమం తలుపులు తెరుచుకున్నాయి.

జనం మరింత పెద్దగా గొంతు చించుకోసాగారు.

సాధువులు పెద్ద బంగారు రంగు సింహాసనాన్ని మోసుకొచ్చి వరండాలో వేశారు. రకరకాల పాత్రలతో పళ్ళూ, పూలహారాలూ మోసుకొచ్చారు. అయిదారు మంది సాధువులు సింహాసనం ముందు కూర్చుని హోమం రగిలించారు. కాసేపటి తర్వాత బిగ్గరగా మంత్రనాదం వెలువడసాగింది.

**"స్వామీజీ దివ్య మాయలోకి వెళ్ళారు. అలా కాసేపు విహరించి వస్తారు. నువ్వు బయటికెళ్ళు వెంటనే" అంటూ అరిచాడు రెండో వ్యక్తి.**

"సంభవం జరిగిపోయినట్టుంది" అంటూ రోదిస్తున్నాడు సంతోష్.

చక్రాలున్న సింహాసనాన్ని నెట్టుకుంటూ సాధువులు కొందరు బయటికొచ్చారు.

సింహాసనం పైన పూలమాలల దొంతరల మధ్యలో స్వామీజీ ఆకారం స్పష్టాస్పష్టంగా కనబడసాగింది.

భక్తులందరూ "సర్వం స్వామీజీ మయం" అంటూ కేరింతలు కొట్టసాగారు.

"అనుకున్నంతా అయింది" అంటూ నిఖిత చతికిలబడింది. ఆమె గుండె వేగంగా కొట్టుకో సాగింది. పెదవులు అదరసాగాయి.

ఈలోగా బక్కపలచటి కుమారస్వామి ఆకారం ప్రధానాశ్రమంలోంచి బయటికొచ్చింది. నేరుగా అతను బంగారు సింహాసనం పైకెక్కి కూర్చున్నాడు.

భజన హోరెత్తిపోసాగింది.

జనాలు కొందరు పారవశ్యాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోతున్నారు. ఎక్కడి జనాలు అక్కడ కర్పూరం వెలిగించి మూర్ఛపోయినవాళ్ళకు హారతులు పడుతున్నారు.

ప్రధానాశ్రమం లోంచి పెద్దగా గంటారావం వినవచ్చింది. దీపాలు వెలుగుతున్న పెద్ద హారతి పళ్ళెంతో పాటు యువస్వామీజీ బయటికొచ్చాడు. అతడి వెనువెంటే చిరంజీవి గూడా నడుస్తున్నాడు.

నేల పైనుంచి ఎవరో విసిరి కొట్టినట్టుగా పైకెగిరి, "చిరంజీవి బతికే ఉన్నాడు" అంటూ అరిచింది నిఖిత.

యువ స్వామీజీ కుమారస్వామికి హారతి పడుతున్నాడు. అతడి పాదాలకు గంధం రాస్తున్నాడు.

సంతోష్ జనం దగ్గరికి పరిగెత్తాడు.

సంభ్రమాశ్చర్యాలతో నిఖిత పయ్యెద ఎగసిపడుతోంది. అసంకల్పితంగా కళ్ళలోంచి జారుతున్న అశ్రువుల్ని తుడుచుకోవడం సైతం మరచిపోయి ఆమె అటే చూడసాగింది.

ఈదురు గాలికి ఇష్టం వచ్చినట్టుగా విసురుకెళ్ళే వాన తుంపరల్లా, భక్తుల గానం తత్తళించిపోతోంది. ఆకాశంలో మెల్లమెల్లగా చీకటి రంగు పలచబారు తోంది. చంద్రవంక పాలిపోవడం ప్రారంభమైంది.

చాలా సేపటి తర్వాత సంతోష్ సిమెంట్ బెంచీ దగ్గరికి తిరిగొచ్చాడు. "స్వామీజీ కరుణాసముద్రుడు, భక్తవత్సలుడు, ప్రేమమూర్తి, డివైన్ ఇన్‌కార్నేషన్, ఆయన ప్రేమ అనన్య సామాన్యం, చిరంజీవి కోసం తన ఆయుస్సునే దానం చేసిన అమృతమూర్తి" అన్నాడు గుక్కిళ్ళు మింగుతూ.

"స్వామీజీ చనిపోయాడా?" ఉలిక్కిపడుతూ అడిగింది నిఖిత.

"కాదు. ఫిజికల్ బాడీని వదలిపెట్టి సమాధిలో కెళ్ళిపోయాడు. ఆయుస్సును చిన్నాజీకీ, ఆశ్రమాన్ని కుమారస్వామీజీకి అప్పగించి వెళ్ళారు. ఆయన భౌతిక కాయం సాక్షిగా యువ స్వామీజీ కుమారస్వామీజీకి పట్టాభిషేకం చేస్తున్నారిప్పుడు" అన్నాడతను ఏడుపుతో రాసుకుపోయిన గొంతుకతో.

నిఖిత నివ్వెరపోయింది.

సింహాసనం పైన కూర్చున్న కుమారస్వామిజీ పాదపీఠికపైన పుష్పాలమరుస్తున్నాడు యువ స్వామీజీ. చిన్నాజీ వింజామర వీస్తున్నాడు.

"స్వాములిద్దరికీ ఏదో అగ్రిమెంటు కుదిరి నట్టుంది" అనుకుంటూ నిట్టూర్చింది నిఖిత.

కాసేపటి తర్వాత, "చిన్నప్పుడు చదివిన ముని పుంగవుడి కథ జ్ఞాపకం వస్తోంది" అంది మెల్లగా.

సంతోష్ తల తిప్పకుండా భజన చేసుకుంటున్నాడు. అతడికి మరింత చేరువగా వెళ్ళి "తన నామస్మరణ చేస్తూ నదిని దాటమని శిష్యులను ఆజ్ఞాపించిన గురువుగారి కథ" అంటూ చెప్పసాగింది.

"సంగతి తెలిసిన గురువుగారికి అనుమానం వచ్చింది. తీరా ఓ రోజు రహస్యంగా వాళ్ళను గమనించాడు. నామస్మరణ చేస్తూ వాళ్ళు నిజంగానే నది నీళ్ళ పైన నడుస్తున్నారు. తన నామానికంత మహత్యముందని ఆయనకంతవరకూ తెలియలేదు. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత తాను గూడా తన నామస్మరణ చేస్తూ నదిపైన నడవబోయాడు. మునిగిపోయాడు..." చెబుతూ చెబుతూ నిఖిత నవ్వేసింది. కాసేపటి తర్వాత "ఇంతకూ ఇక్కడ గురువెవరు? శిష్యులెవరు? మునిగిందెవరు? తేలిందెవరు" అని ప్రశ్నించింది.

"కొందరు కళ్ళుండీ చూడలేరు. చెవులుండీ వినలేరు. అంతా వాళ్ళ కర్మ" అంటూ విసుక్కున్నాడు సంతోష్ తన భజనను కాసేపు ఆపి.

"మానవ శరీరానికి నమ్మకం చెప్పలేనంత బలాన్నివ్వవచ్చు! అయితే, శరీరానికి నమ్మకం కంటే ముఖ్యమైన అవసరాలు కొన్ని ఉంటాయి. వాటిని దానికందజేయకపోవడం దుర్మార్గం, శాడిజం, మాసోచిజం."

సంతోష్ ముఖం అవతలికి తిప్పుకున్నాడు.

"అయితే ఇక మీ చిన్నాజీకి ప్రమాదం తప్పినట్టేనా" అని అడుగుతూ నిఖిత పైకి లేచి తన జిప్‌బ్యాగును భుజానికి తగిలించుకుంది.

సంతోష్ కళ్ళు గట్టిగా మూసుకుని భజనలో ధ్యానను నిమగ్నం చేయడానికి ప్రయత్నించసాగాడు.

అప్పుడప్పుడూ వెనుదిరిగి చూస్తూ ప్రధానాశ్రమం దగ్గరి నుంచి ఆశ్రమం గేటు దాకా నడచి వచ్చింది నిఖిత.

ప్రహరీ గోడకవతల వరసగా నిలచిన మోటరు వాహనాల దగ్గర జనసంచారమింకా మొదలవలేదు.

"ఈ డ్రైవర్లు గూడా లోపలే ఉన్నట్టున్నారు" అని గొణుక్కుంటూ నిఖిత ఓ ఖాళీ మెటాడర్‌లోకెక్కి కూర్చుంది.

ఆశ్రమం లోంచి భజనలూ, మంగళ వాద్యాలూ, శంఖారావాలూ మిన్నుముట్టుతున్నాయి.

లోపల జరుగుతున్న సంరంభంలో ముఖ్య పాత్రధారులైన ఇద్దరు వ్యక్తుల ఆంతరంగిక రహస్యాలు రెండు తన దగ్గర దాగున్నాయన్న విషయం హఠాత్తుగా ఆమెకు జ్ఞాపకం వచ్చింది.

నిఖిత తెరలు తెరలుగా నవ్వసాగింది. అంతవరకూ ఆమె కనుకొలుకుల్లో నిలిచి ఉండిపోయిన రెండు కన్నీటి బొట్లు ఆమె బుగ్గలపైకి పాకాయి. ■